పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా 'డబుల్' ఇళ్లు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన మేరకు అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన డబుల్ బెడ్రూమ్‌లను నిర్మించి ఇస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల ఎంపికైన 500 మంది లబ్ధిదారులతో ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు.పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ దశలవారీగా ఇళ్లను ఇస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్మించిన ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి దశలవారీగా ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గం పరిధిలో 500 మంది చొప్పున 12 వేల మందికి ఇళ్లను ఇస్తున్నారని వీరికి సెప్టెంబర్ 2న ఇళ్లను పంపిణీ చేస్తారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ పథకాల కింద బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఇళ్లను నిర్మించుకున్నారని, ఆ అప్పును తీర్చలేక అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఇబ్బందులను గుర్తించిన సీఎం తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పూర్తిగా మాఫీ చేసి పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. ఇళ్లు రాలేదని ఎవరూ అధైర్యపడవద్దని, దశలవారీగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ కేటాయిస్తారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్ పాల్గొన్నారు.

ముంపు సమస్య లేకుండా చేస్తాం



నాలా పనుల వివరాలు ఆరా తీస్తూ..

బన్సీలాల్‌పేట్: వర్షాకాలంలో వరదనీరు సాఫీగా పారకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ముంపు సమస్యలు తలెత్తేవని వాటి నివారణకు నాలా నిర్మాణాలు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మోండా మార్కెట్ డివిజన్ నాలా బజార్‌లోని నాలా నిర్మాణ పనులు ఆదివారం ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో రూ.60 లక్షల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. రానున్న కాలంలో స్థానిక ప్రజలకు వరదనీటి సమస్య ఉండదన్నారు. నాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓపెన్ నాలా కాకుండా నాలాపై స్లాబ్ వేడయంతో స్థానిక ప్రజలకు నాలా నుంచి దుర్వాసన రాకుండా ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కృషి సాగిస్తున్నట్లు వివరించారు. ప్రజలు సూచించిన సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, నాయకులు ఆకుల హరిక్రిష్ణ, నాగులు, తలసాని స్కైలాబ్, రాములు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమానికి సహకారం

కంటోన్మెంట్: యాదవ సంక్షేమ సంఘానికి తన వంతు సహకారం అందజేస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోయిన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన యాదవ భవనం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మర్రి రాజశేఖర్ రెడ్డి, లాస్య నందిత, జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతో యాదవ భవనం నిర్మాణమైందని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత విజయానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాండుయాదవ్, జక్కుల నర్సింహ రెడ్డి, నళిని, లోకనాథం, శ్యామ్ కుమార్, యాదవ సంఘం ప్రతినిధులు వినోద్ కుమార్ యాదవ్, విఠల్ రావు యాదవ్, పుల్లయ్య యాదవ్, దయానంద్ యాదవ్, రాజు యాదవ్, వెంకటేశ్ యాదవ్, మల్లేశ్ యాదవ్, సంతోష్ కుమార్ యాదవ్, అరుణ్ కుమార్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పరామర్శ

అడ్డగుట్ట: డివిజన్‌కు చెందిన మాదిగ మహిళా సమైక్య నాయకురాలు సూరారం సుజాత భర్త ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ శనివారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. సుజాత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. రాగల ఉపేందర్, డప్పు మల్లికార్జున్, చాగంటి యాదగిరి, దూడపాక శ్రీనివాస్ పరామర్శించారు.

జోరుగా ఓటరు నమోదు

లాలాపేట: భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గత రెండ్రోజుల నుంచి చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జోరుగా సాగింది. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలకు స్పందన వస్తోంది. ఓటు నమోదుతో పాటు చిరునామా, ఫోన్ నెంబర్ వంటి మార్పులు, చేర్పులకు దరకాస్తులను సమర్పించారు.ఆదివారం తార్నాక డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఏమైన సందేహాలు ఉంటే 1950 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల ద్వారా దాదాపు 265 మంది నూతనంగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారుల, బీఎల్‌ఓలు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'ఓట్ల కోసమే సంక్షేమ పథకాలు'

లాలాపేట: ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్లు దండుకోవడానికే సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మభ్యపెడుతుందని ముంబై ఎమ్మెల్యే పరాగ్ అల్వానీ ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం తార్నాకలోని మర్రికృష్ణా ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారం రోజుల నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని మున్సిపల్ డివిజన్లలో పర్యటించానని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడానని బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలెవరూ సంతృప్తిగా లేరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధులు శారదామల్లేష్, ప్రభుగుప్త, కార్యదర్శులు వీరన్న, హరి, పోచయ్యయాదవ్, కృష్ణమూర్తి. నాగేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, సతీష్, ప్రకాష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాసచారి, గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సాయిబాబా

సికింద్రాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా పేర్కొన్నారు. చిలకలగూడ హమాలిబస్తీలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టప్ప, అంజయ్య, సందీప్, రాధాకృష్ణశర్మ, దేవుడు వెంకట్, ఆంజనేయులు, సందీప్‌రాజ్, వెంకటేష్, శ్యామ్, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. చివరి అంకమైన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులతో పాటు స్థానిక కార్పొరేటర్ సామల హేమ హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూజల్లో బిజుమళ్ల శ్రీనివాసశర్మ, హరిశివప్రసాదశర్మ, బిట్ల రఘునందన్, పాతూరి మల్లేష్, శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

పరిశోధనల్లో దూసుకెళ్తున్న సైన్స్ విభాగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలోని 16 ఎమ్మెస్సీ విభాగాలలో పరిశోధనలు, ప్రాజెక్టులతో దూసుకెళ్తున్నాయని ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య పేర్కొన్నారు. ఆదివారం కళాశాల వార్షికోత్సవం (స్పోర్ట్స్ డే) ఉత్సవాల సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. కరోనా అనంతరం నాలుగేళ్ల తర్వాత నిర్వహించిన స్పోర్ట్స్ డేలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీలో ఫార్మంటేషన్ కోర్సు, వచ్చే ఏడాది నుంచి ఎమ్మెస్సీ న్యూట్రిషియన్ కోర్సులను ప్రవేశ పెట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ప్రొ. రాజేష్‌కుమార్, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, వైస్ ప్రిన్సిపల్స్ ప్రొ. చెన్నరెడ్డి, ప్రొ.జయశ్రీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక వాసులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికి తగిన పరిష్కారాలను చూపిస్తామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. తాగునీటి, డ్రైనేజీ సమస్యలతో పాటు బిల్డింగ్ మెయింటెనెన్స్, రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి తదితర సమస్యలను ఈ సందర్భంగా స్థానికులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, మోతె శోభన్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, ఎండీ షఫీ, హారిక, మైథిలీ, చిన్నయ్య పాల్గొన్నారు.

నగరానికి చేరిన సైకిల్ యాత్ర



సికింద్రాబాద్: ఆహిర్ రెజిమెంట్‌ను పునఃస్థాపించాలని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ కుమార్ యాదవ్ దేశవ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం నగరానికి చేరుకుంది. 12 రాష్ట్రాల్లో యాత్రపూర్తి చేసుకుని తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించిన అభిషేక్ కుమార్‌కు అఖిల భారత యాదవ మహాసభ నాయకులు స్వాగతం పలికారు. యాత్రను విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ శాలువాతో సత్కరించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర కోశాధికారి దార బోయిన శ్రీనివాస్‌యాదవ్, జాతీయ యువజన కోఆర్డినేటర్ యశ్వంత్‌రాజ్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యువజన అధ్యక్షులు విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

ఓయూలో 28, 29న జాబ్‌మేళా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో నేడు, రేపు (28, 29) జాబ్‌మేళా జరగనుంది. నేడు ఓయూ క్యాంపస్‌లోని చీఫ్ వార్డెన్ కార్యాలయం పక్కనున్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో రిలయెన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ ఉద్యోగాలకు, రేపు (29న) క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హెట్రో డ్రగ్స్‌లో జాబ్‌మేళా జరనుందని డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు.

ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు సేవరత్న అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ ప్రొ.గాలి వినోద్‌కుమార్‌ను సేవరత్న అవార్డుతో సన్మానించారు. మదర్ థెరిస్సా 113 జయంతి సందర్భంగా వినోద్‌కుమార్ సేవలను గుర్తించిన మదర్ ఫౌండేషన్, రవీంద్రభారతీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రజా విద్యావేత్త కేటగిరిలో సేవారత్న అవార్డును వేణుగోపాలచారి, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రాంగోపాల్‌పేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్‌ఐ స్వామి వివరాల ప్రకారం.. పీజీ రోడ్‌లోని పార్శీధర్మశాల ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతురాలికి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై బూడిద రంగు చుడీదార్, పింక్ కలర్ పైజామా ధరించి ఉందన్నారు. ఇదే ప్రాంతంలో యాచిస్తూ జీవనం సాగిస్తుంటుందని స్థానికులు పేర్కొన్నారు.

'బస్తీపోరు'తో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఆదం సంతోష్ కుమార్

బౌద్ధనగర్: ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి చేపట్టిన బస్తీపోరులో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కరిస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి బౌద్ధనగర్ నిర్వహించిన బస్తీపోరులో ఆయన మాట్లాడారు. అమరుల ఆకాంక్షను నెరవేర్చడానికి, పాపాత్ముల పరిపాలన అంతమొందించడానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆస్తులను కాపాడటంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్, డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, మహేందర్, జయరాజ్, సతీష్, లడ్డు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సంతోష్ కాలనీకి చెందిన రాహుల్ కుమార్ (25) కాచిగూడ రైల్వే స్టేషన్ పాయింట్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆర్కేపురం నుంచి అమ్ముగూడా రైల్వే స్టేషన్ మార్గమధ్యలోని పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

బోగస్ ఓట్లపై ఫిర్యాదు చేస్తాం



బీఎల్‌ఓతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ఒకే ఇంట్లో 26 మంది ఓటర్లు ఉండడ, వారందరికీ వేర్వేరు పోలింగ్ బూత్‌లను కేటాయించడం పట్ల మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాల్సి ఉండగా పలుచోట్ల లేకపోవడాన్ని తాము గుర్తించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో పలు పోలింగ్ బూత్‌లలో ఓటరు జాబితాలను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏ ఓటరు జాబితా చూసినా కొందరి ఓట్లు వేరే నియోజకవర్గంలో ఉన్నట్లు తాము గుర్తించామని అలాగే కొంతమంది ఓటర్ల చిరునామాలు కూడా జాబితాలో లేవన్నారు. ఈ అంశాలన్నింటినీ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఎన్నికల కమిషన్ పట్టించుకోని పక్షంలో తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దయానంద్, క్రాంతికుమార్, శ్రీనివాస్, నరేందర్, వంశీ, సుబ్బారావు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌కు చెందిన పవన్ (23)కు కొంత కాలంగా మానసిక స్థితి బాగలేదు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పార్కులను అభివృద్ధి చేస్తున్నాం

సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్‌లో ఉన్న పార్కులను అభివృద్ధి పర్చి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కులో ఆదివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్, తలసాని పిలుపుమేరకు మొక్కలు నాటడంతోనే తెలంగాణ రాష్ట్రం పచ్చదనంతో నిండుతుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాతనే దేశంలోకెల్లా అత్యధిక హరితవృద్ధి తెలంగాణలోనే జరిగిందని నివేదికలు చెబుతున్నాయన్నారు. జోత్స్న ప్రియదర్శిని, సంధ్య, బాల్‌రెడ్డి, అశోక్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రాత్మకం: సర్వే

కంటోన్మెంట్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రాత్మకం అని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. చేవెళ్ల సభలో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సర్వే సత్యనారాయణ కలిశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. కొన్నేళ్లుగా పార్టీలో సైలెంట్‌గా ఉంటూ వచ్చి సర్వే సత్యనారాయణ ఇటీవల కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన జాతీయ అధ్యక్షుడిని కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పార్కు చేసిన బైక్ చోరీ

బౌద్ధనగర్: ఇంటిముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైన ఘటన వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ప్రకాష్‌రెడ్డి వివరాల ప్రకారం.. బౌద్ధనగర్‌కు చెందిన కృష్ణ కుమార్ శనివారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్క్ చేశాడు. తెల్లారి చూడగా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'దళితులను దగా చేస్తున్న బీఆర్‌ఎస్'



పాదయాత్రలో పాల్గొన్న కోట నీలిమా

బన్సీలాల్‌పేట్: దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనంతరం వారిని దగా చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా ఆరోపించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఆదివారం దళిత గర్జన పేరిట పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. దళిత, ఇతర వెనుకబడిన వర్గాల సమస్యలు, సాధక బాధలను పట్టించుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైయిందన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద ప్రజలు బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారని వీరి జీవితాల్లో వెలుగు నింపడంతో వీరి అభివృద్ధికి తోడ్పాటునందించడంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విఫలమయ్యారన్నారు. బన్సీలాల్‌పేట్‌లో దళిత బంధువు పథకాన్ని కేవలం బీఆర్‌ఎస్ నాయకులు, వారి బంధువులకు మాత్రమే కట్టబెడుతుండటంతో అర్హులైన ఎంతో మంది దళితులకు ఆ పథకం అందలేదన్నారు. రాజీవ్ గాంధీ దళిత స్కాలర్ షిప్ పేరిట ఇద్దరు పేద విద్యార్థులకు రూ. 25వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

బన్సీలాల్‌పేట్: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ సూచించారు. పాన్‌బజార్‌లోని తన కార్యాలయంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, ఇతరత్రా వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధితోనే పేదల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి విద్య ఒక్కటే మార్గం చూపుతుందన్నారు. పేదలు తమ పిల్లలను బాగా చదివించాలని మీరు వారికి ఇచ్చే అతి పెద్ద ఆస్తి చదువే అన్నారు. లక్ష్యసాధన కోసం నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీర శ్రీకాంత్, ప్రతాప్‌లతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు బీమా కార్డుల అందజేత

రసూల్‌పురా: ఆటో డ్రైవర్లకు చేయూతనిచ్చేందుకు తమ ఫౌండేషన్ తరఫున ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ పేర్కొన్నారు. ఆదివారం లీ ప్యాలెస్‌లో మొదటి విడతలో కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 450 మంది ఆటో డ్రైవర్లకు ఫౌండేషన్ తరఫున యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క రూ.3 లక్షల ప్రమాద బీమా కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్ తరఫున విద్య, వైద్య సామాజిక రంగాలతో పాటు సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకు అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ.. ఏ పార్టీ నాయకుడు కూడా తమ సమస్యలు పట్టించుకోలేదని కానీ.. తమకు బీమా చేయించాలని కోరగా ముందుకొచ్చి ప్రమాద బీమా చేయించడం సంతోషకరమన్నారు.

'కంటోన్మెంట్‌లో బీజేపీ జెండా ఎగరేస్తాం'

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కంటోన్మెంట్ ప్రజలు అసంతృప్తితో ఉన్నారని వచ్చే ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో బీజేపీ జెండా ఎగర వేస్తోందని కర్ణాటక ధార్వాడ్ ఎమ్మెల్సీ సంకనూర్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వాసవీనగర్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనబర్చిందని, అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. బీజేపీ నాయకులు, నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ కోర్టును ఆశ్రయించడంతో ఉచిత మంచినీటి పథకం అమలు, టీపీటీ నిధులు విడుదల చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో భానుక మల్లికార్జున్, మన్నే శ్రీనివాస్, సుష్మిత, రజిని రెడ్డి, పరశురాం. మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎన్. శ్రీనివాస్, సతీష్, కన్వీనర్ విజాయనంద్ పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

కంటోన్మెంట్: ప్రాచీన భారతీయ క్రీడలకు ఆదరణ పెరగడం సంతోషకరమని మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ స్కూల్ ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన బాక్స్ లంగడీ (కుంటుడు) జాతీయ స్థాయి క్రీడల ముగింపు వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. కబడ్డీతో పాటు ఇటీవల బాక్స్ లంగడీ వంటి క్రీడల పట్ల ఆదరణ పెరుగుతోందన్నారు. శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపకరించే ఇలాంటి ఆటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో బాక్స్ లంగడీ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ ముప్పిడి మధుకర్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, సెయింట్ పీటర్స్ స్కూల్ సెక్రెటరీ రణదీర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ హరీష్, పెద్దాల నర్సింహ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మేళతాళాలు, బాజాభజంత్రీలు, పండితుల వేదఘోషల నడుమ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ పవిత్రత, పరిశుభ్రత అవధారణ చేసేందుకు, స్వామివారి కైంకర్యంలో మంత్ర, క్రియా, కర్తవ్య, మానవ దోషాలను పరిహరించేందుకు ప్రతిఏటా పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణు గోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు జరిగే పవిత్రోత్సవాలలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



ఊరేగింపులో పాల్గొన్న మర్రి ఆదిత్యరెడ్డి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ సీ-క్లాస్ మహిళలు ఆదివారం పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు. బన్సీలాల్‌పేట్ నుంచి మహంకాళి దేవాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బన్సీలాల్‌పేట్‌లో బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్రి ఆదిత్యరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్. విఠల్, డాక్టర్ శివకుమార్ లాల్, నారాయణ, శ్రీనివాస్, నిరంజన్, టి. మనోజ్‌కుమార్, సీపీ శంకర్, క్రిష్ణ ముదిరాజ్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో..

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నల్లగుట్టలోని జూలమ్మ దేవాలయం, ఎఫ్‌లైన్‌లోని కొండపోచమ్మ దేవాలయం, కాచిబోలిలోని పోచమ్మ దేవాలయం, గైదీన్‌బాగ్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం, నల్లగుట్ట జే లైన్‌లోని భ్రమరాంభికా దేవాలయం, బాలత్రిపుర సుందరీ దేవాలయం తదితర ఆలయాల్లో వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్‌లో అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, బీజేపీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.